ఆన్ స్టేజ్



# కూతురి హృదిలో దేవరాగం



అల్జీమర్స్ (మతిమరుపు) వ్యాధిగ్రస్తులు ఇంటి నుంచి బయటికి వెళ్లినంత తేలికగా తిరిగి రాలేరు. ఎవరైనా అడిగినా.. తమ చిరునామా చెప్పలేరు.

కుటుంబసభ్యుల పేర్లూ మర్చిపోతుంటారు. ఒక్కోసారి బాగా పరిచయం ఉన్న ముఖాలనూ గుర్తుపట్టక పోగా దొంగలు, ప్రమాదకర వ్యక్తులని భయపడతారు. ఇది కోటికొక్కరికి వచ్చే రోగం కాదు. 65 ఏళ్లు దాటిన ప్రతి తొమ్మిది మందిలో ఒకరు బాధపడుతున్న రుగ్మత. ఈ అంశాన్ని ఇతివృత్తంగా రూపొందించిన నాటిక 'దేవరాగం'. అజో- విభో- కందాళం, జాషువా సాంస్కృతిక కేంద్రం సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన కథా నాటిక పోటీలో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా దేవరాగం ఎంపికైంది.

**కథాంశం:** ఓ తండ్రి ఉద్యోగ విరమణ అనంతరం భార్యలేక ఒంటరి జీవితం గడుపుతుంటాడు. పొరుగున ఉన్న స్నేహితుడు మాత్రం అప్పుడప్పుడూ వచ్చిపోతూ ఉంటాడు. కొడుకు-కోడలు అమెరికాలో ఉంటారు. కూతురు-అల్లుడు వాళ్ల పిల్లలు అదే నగరంలో మరో చోట ఉంటుంటారు. అనుకోకుండా అల్లుడికి ప్రమోషన్ రావడంతో కుటుంబ సమేతంగా అమెరికాకు ప్రయాణం కట్టాల్సి వస్తుంది. 'ఈ ఒక్కతోడు కూడా దూరమైతే ఎలారా బాబు?' అని ఆ తండ్రి మనోవేదనకు గురవుతాడు. ఒంటరిగా ఉండలేక, నిద్ర రాక, తనలో తాను మదనపడుతూ తొలుత మతిమరుపు, తర్వాత డెమెన్షియా (చిత్త భ్రాంతి)కి లోనవుతాడు. ఈ దశలో చాలామంది ఆ పెద్దాయనకు పిచ్చిపట్టిందని భావిస్తారు. తర్వాత తనను, తన వారిని, తన పరిసరాలను మర్చిపోతుంటాడు. మూడోదశలో అల్జీమర్స్ వ్యాధిగా మారుతుంది.

తండ్రి మానసిక పరిణామం గ్రహించక కూతురు, అల్లుడు మొదట అందరిలాగే అపోహపడతారు. ఆయన స్నేహితుడి ద్వారా నిదానంగా సమస్యను అర్థం చేసుకుంటారు. ఆ తర్వాత డాక్టర్ చెప్పే విషయాలతో తేరుకుంటారు. 'వ్యాధి ఉపశమనానికే చికిత్స తప్ప, పూర్తిగా నిర్మూలించే మందులు ఇంకా కనిపెట్టలేదు' అని డాక్టర్ చెప్పడంతో హతాశులవుతారు. 'ఈ వ్యాధికి గురైనవారు ఎక్కువలో ఎక్కువగా ఐదేళ్లు మించి బతకరని, వీరిని కంటికి రెప్పలా కాపాడుకోవాల'ని డాక్టర్ విశదపరుస్తాడు. నాటిక ఇక అక్కడినుంచి కొత్త మలుపులు తిరుగుతుంది.

తండ్రి బాధ్యతలు ఎవరు తీసుకోవాలి? కొడుకా? కూతురా? సంప్రదాయం ప్రకారం కొడుకే చూసుకోవాలి. కానీ, అమెరికాలో ఉన్న కొడుకు ఉద్యోగ బాధ్యతల రీత్యా ఇండియా రాలేనంటాడు. అవసరమైతే డబ్బు పంపగలను తప్ప మరేమీ చేయలేనని నిస్సహాయతను వ్యక్తం చేస్తాడు. కూతురికి తండ్రంటే ప్రాణం.



నాటిక: దేవరాగం

మూలకథ: సలీం

నాటకీకరణ, దర్శకత్వం: కె.కె.ఎల్. స్వామి

ప్రదర్శన: సౌజన్య కళా స్రవంతి

పాత్రధారులు: సత్యనారాయణ, వెంకట రాజు, జ్యోతిరాణి, పోలినాయుడు, శివ, గంగాధరయ్య

తండ్రి కోసం తమ అమెరికా ప్రయాణాన్ని మానుకోమని భర్తను ప్రాధేయపడుతుంది. భర్త ససేమిరా అంటాడు. ఈ అవకాశాన్ని వదులుకుంటే, జీవితమే గతి తప్పుతుందని వాదిస్తాడు. తన మాటను కాదని తండ్రి వెన్నంటి ఉంటానని నిర్ణయించుకున్న భార్యతో విడిపోవడానికి సిద్ధమవుతాడు.

తన కుటుంబం ఛిద్రమైనా తండ్రి సేవకే అంకితం కావాలనే దృఢ సంకల్పానికి వస్తుంది కూతురు. విషయం తెలుసుకున్న ఆమె తండ్రి స్నేహితుడు 'లోకానికి ఎదురీదుతున్నావేమో? ఆలోచించుకోమ'ని హెచ్చరిస్తాడు. 'నీటిలో చేపలు, గాలిలో పక్షులు ఎదురీది బతుకుతున్నప్పుడు మనిషిగా నేను పరిస్థితులను ఎదిరించలేనా?' అని ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటిస్తుంది.

'దైవ లక్షణం కరుణామృతం. అపారమైన కరుణ, అనంతమైన దయ శ్రుతిలయలుగా పలికే రాగమే దేవరాగం. అది అందరికీ వినిపించదు. మానవ సంబంధాలను బరువుగా కాక బాధ్యతగా భావించే నీవంటి మానవతామూర్తి హృదయాల్లో అది ప్రతిధ్వనిస్తుంది' అని స్నేహితుడు ఆమెకు అంజలి ఘటించడంతో తెర పడుతుంది.

కఠినమైన భౌతిక పరిస్థితులకు- సున్నితమైన భావోద్వేగభరిత మానవ సంబంధాల మధ్య చెలరేగే ఘర్షణను సమతూకంలో ఈ నాటిక ఆవిష్కరించింది. 'కుంచం వంటి కూతురు ఉంటే మంచం కాడికి కంచం నడుచుకుంటూ వస్తుంద'నే మన సామెతను ఈ నాటికలోని కూతురు నిజం చేస్తుంది. ■

... కె. శాంతారావు
రంగస్థల నటుడు, విశ్లేషకుడు